చిత్తూరు సామ్రాట్ ఎవరో..?


చిత్తూరు ఎస్వీ-సెట్‌లో ఓట్ల లెక్కింపు జరగనున్న కేంద్రం



చిత్తూరు అసెంబ్లీ స్థానం కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- 10 గంటకు పోస్టల్ బ్యాలెట్, 11 గంటలకు ఈవీఎం ఫలితాలు
- మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి ఫలితాలు

చిత్తూరు అర్బన్: ఐపీఎల్‌లో లక్ష్యాన్ని చేరుకోవడానికి చివర్లో పడే టెన్షన్ అంతా ఇంతా కాదు. అక్కడ బంతి బంతికీ ఉత్కంఠ పెరుగుతూ ఉంటుంది. ఈ అనుభవం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా అనుభవించాలంటే మాత్రం మరో కొద్ది గంటల్లో జరిగే ఓట్ల లెక్కింపును చూడాల్సిందే. ఐపీఎల్‌లో ప్రతి బంతినీ బౌండరీ లైన్ దాటించడానికే బ్యాట్స్‌మెన్ ప్రయతిస్తుంటాడు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్ నరాలు తెగే ఉత్కంఠను రేపుతుంది. ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు మైనస్ చేశాం.. మనకు ఎన్ని ప్లస్ అయ్యాయంటూ లెక్కలేసుకుంటారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో తొలిగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఇది ఉదయం 10 గంటలకు పూర్తయ్యే అవకాశం ఉంది. అటు తరువాత 11 గంటలకు ఈవీఎంలలోని ఫలితాలు ఓ స్థాయికి వచ్చే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. తుదిగా ఎవరు గెలిచారనే విషయం మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడనున్నాయి. ఫలితంగా చిత్తూరు ఎమ్మెల్యే స్థానానికి ప్రజలు ఎవరికి పట్టం కట్టారనే విషయం తేలతెల్లమవుతుంది.

పెరిగిన పోలింగ్ శాతం ఎటువైపో?

చిత్తూరు నియోజకవర్గ పరిధిలో చిత్తూరు నగరంతోపాటు చిత్తూరు మండలం, గుడిపాల మండలాల్లో గత నెల 13న పోలైన ఓట్లను ఎస్వీ-సెట్ కళాశాలలో లెక్కిస్తారు. ఇందులో ఈవీఎంలలో పడ్డ ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు కూడా ఉంటాయి. నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 2 శాతం పెరిగింది. 2019లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,93,089 మంది ఓటర్లు ఉంటే, 1,53,206 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 79.34 శాతంగా పోలింగ్ నమోదైంది. ఇందులో వైఎస్సార్‌సీపీకి 91,206 ఓట్లు పోలయితే, టీడీపీకి 51,230 ఓట్లు పడ్డాయి. వైఎస్సార్‌సీపీకి దాదాపు 40 వేల మెజారిటీ వచ్చింది. ఈసారి జరిగిన పోలింగ్‌లో 1,64,788 మంది ఓటు హక్కును వినియోగించుకుంటే, వీరిలో మహిళలు 84,278, పురుషులు 80,493, ఇతరుల 17 మంది ఉన్నారు. 81.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇవి కాకుండా పోస్టల్ బ్యాలెట్ రూపంలో 4,207 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఎటువైపు అనే విషయం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

తొలి ఈవీఎం అదే..

నియోజకవర్గానికి సంబంధించి తొలి ఈవీఎం చిత్తూరు నగరంలోని మంగసముద్రం పోలింగ్ స్టేషన్ నుంచి ఓట్లను లెక్కిస్తారు. తొలి పది రౌండ్లలో చిత్తూరు నగరంలో పోలైన ఓట్లు, 11 నుంచి 13వ రౌండ్ వరకు చిత్తూరు మండలం ఓట్లు, చివరి నాలుగు రౌండ్లలో గుడిపాల ఓట్లను లెక్కిస్తారు. చివరి ఈవీఎం గుడిపాల మండలం పానాటూరు పంచాయతీలోని 226వ పోలింగ్ కేంద్రంలో పడ్డ ఓట్లను లెక్కించడంతో పూర్తవుతుంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

ఎస్వీ-సెట్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే ఎంపీ స్థానానికి పడ్డ ఓట్లను కూడా ఇక్కడే లెక్కించనున్నారు. తొలుత కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎంపీ స్థానానికి పోలైన ఓట్లను కలెక్టర్ సమక్షంలో, ఎమ్మెల్యే ఓట్లను ఆయా కేంద్రంలోనే లెక్కబెడతారు. ఇవి పూర్తవగానే ఈవీఎంలను (చిత్తూరుకు 226 ఈవీఎంలు) లెక్కిస్తారు. ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. తొలుత 14 టేబుళ్లపై 14 ఈవీఎంలను ఉంచి అందులో ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయో అక్కడికక్కడే ఫలితాల బటన్ నొక్కి చూపుతారు. దీన్ని తొలి రౌండ్ అంటారు. ఇలా 16 రౌండ్లకు 224 ఈవీఎంలను లెక్కిస్తారు. చివరగా 17వ రౌండ్‌లో మిగిలిపోయిన ఈవీఎంలను లెక్కిస్తారు. ఈవీఎంల ఫలితాలు ఉదయం 11 గంటలకు ఓ అంచనాకు రానుండగా, మధ్యాహ్నం 12.20 గంటలకు పూర్తవుతుంది. అనంతరం వీవీ ప్యాట్ల చీటీలను లెక్కపెట్టడానికి నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాలను రాసి ఓ బాక్సులో వేసి, లాటరీ పద్ధతిలో 5 చీటీలను బయటకు తీస్తారు. వచ్చిన నంబర్లలోని వీవీప్యాట్లను లెక్కపెడతారు. అనంతరం గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారు. చివరి ఫలితాలు మధ్యాహ్నం రెండు గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

వరసిద్ధునికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి నిత్య అన్నదానానికి రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆ నగదును ఆలయ అధికారులకు నగదు రూపంలో అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు వాసు, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తవణంపల్లె: ఓట్లు లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఫలితాలు వెల్లడైనా నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమయమనం పాటించాలని ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి సూచించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత గెలుపొందిన అభ్యర్థుల ఫలితాలు వెల్లడించాక పల్లెల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించడం, బాణాసంచా కాల్చినా, ఊరేగింపులు చేసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మండలంలో మూడు రోజులపాటు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీసుల హెచ్చరికలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకం



బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీసల్లాపురెమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి 108 బిందెలతో పసుపు, కుంకుమ నీటిలో కలిపి అభిషేకించారు. అనంతరం పాలాభిషేకం, లక్ష పుష్పార్చన, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఉపవాసదీక్షలో మహిళలు అమ్మవారికి 108 బిందెల నీటిని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అభిషేకాలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను అందజేశారు.

వైద్యానికి ఆర్థిక సాయం

పలమనేరు: నియోజకవర్గంలోని వి.కోట మండలం గోనుమాకులపల్లెకు చెందిన మణికంఠ అనే యువకుడు లివర్ క్యాన్సర్‌తో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని ట్రీట్‌మెంట్‌కు డబ్బు ఎక్కువగా అవుతుందని అక్కడి వైద్యులు తెలపడంతో ఈ విషయాన్ని ఆ గ్రామస్తులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇది చూసి వాస్తవమేనని తెలుసుకున్న మండలంలోని మొరం గ్రామానికి చెందిన సర్వీస్ టు సొసైటీ నిర్వాహకులు అశోక్ ఆలమట్టి రూ.11 వేలకు ఆర్థిక సాయం చేశారు.

దుకాణాలు తెరవొద్దు


ఆటోలో మైకులతో హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

వి.కోట: కోడ్ అమల్లో ఉండటం, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం మండలంలోని అన్ని దుకాణాలు మూసివేయాలని, పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు పెట్రోల్ పట్టరాదని సీఐ లింగప్ప కోరారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ, రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఫొటోలు, వీడియోలను వాట్సాప్‌లో షేర్ చేసినా, స్టేటస్‌గా పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మండలంలో విజయోత్సవ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం నిషేధమని ఆటోల్లో మైక్ ల ద్వారా పోలీసులతో హెచ్చరికలు జారీ చేశారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు


పుణ్యసముద్రంలో వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రం సచివాలయం పరిధిలో ఉన్న ద్వారకాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు భుజించాలని సూచించారు. ఐరన్ మాత్రలు ప్రతి రోజూ వాడాలని చెప్పారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు పరీక్షలు చేయించుకొని మాత్రలు వాడాలన్నారు. 43 మందికి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంధమనేని పారిజాతమ్మకు నివాళి


పారిజాతమ్మకు నివాళులర్పిస్తున్న నారాయణ, జయచంద్రనాయుడు

పుత్తూరు: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, దివంగత పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ (84) మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కుమారుడు గంధమనేని గౌతమ్‌తో చెన్నైలో నివసిస్తున్న పారిజాతమ్మ ఆదివారం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని హరీష్‌నాయుడు సోమవారం చెన్నైలోని కోడంబాక్కంలో ఆమె స్వగృహానికి వెళ్లి పారిజాతమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గంధమనేని సేవలు నిరుపమానం

సీపీఐ సీనియర్ నేత గంధమనేని శివయ్య పుత్తూరు ఎమ్మెల్యేగా చేసిన సేవలు నిరుపమానమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పారిజాతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటులో శివయ్య ప్రధాన భూమిక పోషించినట్లు గుర్తు చేశారు. 1970 దశకంలోనే శివయ్య వ్యవసాయంపై సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన శివయ్య ఎమ్మెల్యే అయినా చివరి వరకు సాధారణ జీవితాన్నే గడిపారన్నారు. శివయ్య, పారిజాతమ్మ దంపతులిద్దరూ తుది శ్వాస వరకు వామపక్ష భావజాలాలతోనే అనుసరించడం గర్వంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు పారిజాతమ్మకు వరుసకు సోదరుడు కావడం గమనార్హం. అనంతరం పారిజాతమ్మ కుమారుడు గంధమనేని గౌతమ్, కుమార్తె విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులకు నారాయణ, జయచంద్రనాయుడు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఆల్ ఇండియా హ్యాండ్‌లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.కళ్యాణ్‌చక్రవర్తి, సీపీఐ జిల్లా నేత రామానాయుడు, కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్, పిచ్చాటూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీనాయుడు తదితరులు ఉన్నారు.

నేడు ప్రదోష పూజలు

వెదురుకుప్పం: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కూరగాయల సంత రద్దు

నింద్ర: మండలకేంద్రం నింద్ర గ్రామంలో మంగళవారం జరిగే కూరగాయల సంతను రద్దు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధరణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉండడం వల్ల సంతను నిలిపివేయడం జరిగింది. ప్రజలు గమనించాలని కోరారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: చవటగుంటలో ఉన్న ఆవుదేవర మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

గజరాజుపై వేణుగోపాలుడి విహారం


గజ వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలస్వామి

కార్వేటినగరం: కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం రాత్రి గజ వాహనంపై, ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తజనుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాలు, వేద ఘోష నడుమ వాహన సేవలు అంగరంగ వైభవంగా సాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వేదపండితులు ఆలయంలో వేదమంత్రాలతో వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించి పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం స్వామివార్లను మాడవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో శుద్ధి, తోమాల, రాత్రి గంట చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల నడుమ పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలోకి వేంచేపు చేసి, పండితుల వేద మంత్రాల నడుమ ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించారు.


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

అలరించిన సంగీత కచేరి

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించిన సంగీత కచేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. స్వామివారికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించారు. రాత్రి 7గంటలకు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం గజవాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.45 గంటలకు టీటీడీ వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త

- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు
- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు


బంగారుపాళెంలో విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

బంగారుపాళెం: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం అనుకూలించేలా ఉండడంతో రైతులు విత్తనాలు విత్తే పనులు చేపట్టారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, వేరుశనగ, మిరప, ఎక్కువగా సాగుచేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉండడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు మండలంలోని దుకాణాలతో పాటుగా చిత్తూరు, పలమనేరు ప్రాంతాలకు వెళ్తుంటారు. కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతుంటారు. దీంతో రైతులు ఆకర్షితులై దుకాణాల్లో విత్తనాలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. నకిలీ విత్తనాల బారినపడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు, నష్టపోయినా పరిహారం సైతం పొందవచ్చని పేర్కొంటున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ, వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీపేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకు రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒక వేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందేందుకు వీలుంటుంది. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

– చిట్టిబాబు, ఏఓ, బంగారుపాళెం

హద్దు మీరితే చర్యలు తప్పవు


పోలీసులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

- పలమనేరులో 144 సెక్షన్ అమలు
- టీ దుకాణాలు, హోటళ్లు, దాబాలు బంద్
- పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ హెచ్చరిక

పలమనేరు: ఓట్ల లెక్కింపు మంగళవారం చేయనున్న సందర్భంగా పలమనేరులో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి విధులపై మార్గదర్శనం చేశారు. పట్టణంలోని జనం ఎక్కువగా వచ్చే టీ దుకాణాలు, హోటళ్లు, దాబాలు మొదలైనవి తెరవరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో 200మంది వరకూ రౌడీలు, పాత కేసుల్లో నిందితులను, గ్రామాల్లోని ఇబ్బందులు కలిగించే అనుమానితులను బైండోవర్ చేసుకున్నామని, వీరు పట్టణంలో కనిపించడానికి వీలు లేదన్నారు. ఎక్కడైనా నలుగురికంటే ఎక్కువగా గుమిగూడితే చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాల వద్ద జనం గుమి గూడరాదన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్‌లో ఎవరైనా పార్టీలకు విరుద్ధంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్‌తోపాటు షేర్ చేసిన వారిపై కేసులు తప్పవన్నారు. పట్టణంలో బాణసంచా కాల్చరాదని, ర్యాలీలు చేయరాదని స్పష్టం చేశారు.